క్లుప్తంగా

హోరాహోరీగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న జంబాడ క్రీడాకారులు

విజయపురం: మండలంలోని జంబాడ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రీడా పోటీల్లో పన్నూరు, జంబాడ, విజయపురం, శ్రీహరిపురం, గంగమాంబపురం పాఠశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్ అండర్ 14, 17 క్రీడలు జరిగాయి. ఇందులో బాలురు, బాలికలు పాల్గొని తమ సత్తాచాటారు. క్రీడల్లో 250 మంది పాల్గొనగా అందులో 120 మంది ఎంపికయ్యారని నగరి నియోజకవర్గ కోఆర్డినేటర్ గుర్రప్ప తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు బుధవారం పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాలలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. మండల కన్వీనర్ గోపి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



బ్యూటీషన్ వస్తువులు పంపిణీ చేస్తున్న హరి

పుత్తూరు: చేతి వృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జన్ శిక్షణ్ సంస్థాన్ అధికారి హరి కోరారు. మంగళవారం స్థానిక రాస్ కార్యాలయంలో బ్యూటీషియన్ కోర్సు శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. హరి మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం బ్యూటీషియన్ సామగ్రిని పంపిణీ చేశారు. రాస్ అధికారి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

పుత్తూరు: స్థానిక కాపువీధిలోని ఎంపీయూపీ బాలికల పాఠశాలలో మంగళవారం పట్టణానికి చెందిన రమేష్ పురోహిత్, ధనలక్ష్మి దంపతులు విద్యాసామగ్రిని వితరణగా అందజేశారు. 140 మంది విద్యార్థులకు రూ.15 వేల విలువచేసే నోట్‌బుక్స్, స్లేట్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఎంఈఓ తిరుమల రాజు, ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, ఆడిటర్ రామకృష్ణ, విజయకుమార్, మధు, పాఠశాల కమిటీ చైర్మన్ ముంతాజ్, హెచ్ఎం మల్లికా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా స్థావరంపై దాడి

శ్రీరంగరాజపురం: మండలంలో సారా తయారీ స్థావరాలపై ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపుదాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని పాదలపల్లిలో సారా తయారుచేస్తున్నట్లు రహస్య సమాచారం అందడంతో ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో స్థావరంపై దాడి చేసి 8 లీటర్ల సారా, నిందితుడు చిరంజీవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా సారా కాచినా, విక్రయించినా రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటో..ఇటో!

ప్రమాదకరంగా ఆటో ప్రయాణం

- గ్రామాలకు సరిపడా లేని ఆర్టీసీ బస్సులు
- తప్పని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- కిక్కిరిసిన రద్దీతో ప్రమాదాలు నిత్యకృత్యం
- అయినా కన్నెత్తి చూడని అధికారులు

విజయపురం: నగరి నియోజకవర్గంలో ఆటోలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు పరిమితికి మించి ఆటోల్లో నిల్చొని ప్రయాణం చేస్తున్నారు. ఆటో నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా ఎక్కువ మందిని ఎక్కించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఆటోస్థాయికి మించి ప్రయాణికులు ఎక్కడంతో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరగా గమ్యం చేరాలనే లక్ష్యంతో డ్రైవర్లు అతివేగంగా ప్రయాణిస్తూ బోల్తా కొట్టిస్తున్నారు. ఆటోల్లో అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న ఆటోలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతమంది లగేజీ ఆటోల్లో కూడా ప్రయాణికులను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. దీనికి ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన ఆర్టీసీ బస్సులు లేకపోవడం అంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

ఆర్టీసీ బస్సుల కొరతే ప్రధాన కారణం

నగరి నియోజకవర్గంలోని విజయపురం, నింద్ర, వడమాలపేట, నగరి రూరల్, పుత్తూరు రూరల్ మండలంలో 110 పంచాయతీలు ఉండగా అందులో 500లకు పైగా గ్రామాలు ఉన్నాయి. ఇందులో నేటికి 100 గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేదు. ఒక వేళ ఉన్నా రోజుకు ఒకటి, రెండు ట్రిప్పులు తిరగడం లేదు. ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రమైనందున ప్రజలు చేసేది లేక ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో వివిధ గ్రామాల్లో తిరిగిన అనేక బస్సులను రద్దు చేశారు. ప్రధాన పట్టణాలకు వెళ్లే బస్సులను కూడా తగ్గించారు. ప్రధాన రహదారుల్లో వెళ్లే బస్సులను కూడా తగ్గించారు. రోజురోజుకు జనాభా పెరుగుతున్న నేపథ్యంలో బస్సుల సంఖ్య తగ్గించడంతో ప్రజలు ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితిలో ఆటోల్లో వెళ్తున్నారు. ఓవర్‌లోడ్ ప్రయాణం అరికట్టాల్సిన రవాణా శాఖ పట్టించుకొనే దాఖలాలు లేవు. కొన్ని ఆటోలు ఫిట్‌నెస్ లేకపోయినా ప్రయాణికులను ఎక్కించుకొని నడుపుతున్నారు. ఆటోలు ఓవర్ లోడ్‌తో ప్రయాణించడంతో ఇటీవల కాలంలో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. అధికారులు ఆటోలను క్రమబద్ధీకరించి సరైన మార్గంలో నడిపించకపోతే రోడ్డు ప్రమాదాలు మరింత పెరిగే పరిస్థితి లేకపోలేదు.



ఆటోలో వెళుతున్న విద్యార్థులు

విద్యార్థులకు తప్పని తిప్పలు

విజయపురం, నింద్ర మండలం నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం నగరి, పుత్తూరు ప్రాంతాలకు వెళుతుంటారు. వీరికి అవసరమైన బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరు నిత్యం ఆటోలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా పుత్తూరుకు కిలోమీటర్ దూరంలో ఓ ప్రైవేట్ ఇంజినీర్ కళాశాల, నాలుగు కిలోమీటర్ల దూరంలో పరమేశ్వరమంగళంలో మరొక కళాశాల ఉంది. ఇక్కడ వందల సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరిపడే బస్సు లేకపోవడం..ఉన్నా వాటిని కళాశాల వద్ద ఆపకపోవడంతో ఆటోపై ఆధారపడుతున్నారు. దీనితో ఆటోడ్రైవర్లు పోటీలపై వేగంగా నడుపుతున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌తో నూతన ఆవిష్కరణలు



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారుల బృందం

పుత్తూరు: ఇన్‌స్పైర్ మనక్‌తో నూతన ఆవిష్కరణలు సాధ్యమని డీఈఓ శేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో పుత్తూరు డివిజన్‌లోని సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనక్, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, నేషనల్ గ్రీన్‌కోర్ (ఎన్‌జీసీ) శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లు విధిగా పంపాలని ఆదేశించారు. నామినేషన్లు అక్టోబర్ 15లోపు పంపాలని తెలిపారు. అనంతరం అగస్త్య ఫౌండేషన్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కరపత్రాలను విడుదల చేశారు. డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం కోఆర్డినేటర్లు వీరేష్, హరిశంకర్, మేఘనాథ్, సుబ్రమణ్యశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

నగరి: తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి జనవిజ్ఞాన వేదిక 34 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలుత పాఠశాల స్థాయిలో నిర్వహించే ఈ పోటీల నుంచి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి అక్టోబర్ 1న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ చూపిన వారిని గుర్తించి అక్టోబర్ 27న జిల్లా స్థాయి పోటీలు, ఆపై నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఈ ఏడాది నగరి మండలంలోని 12 ఉన్నత పాఠశాలల నుంచి మాత్రమే 700 మంది విద్యార్థులు ఈ పోటీల్లోపాల్గొంటున్నట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు.



ఎం.కొత్తూరు జెడ్పీ హైస్కూల్లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హెచ్ఎంలు

ఉన్నత పాఠశాలలందు హెచ్ఎంలు చెకుముకి సంబరాలకు చెందిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించి విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పాలసముద్రం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. మంగళవారం ఎస్ఆర్ఆర్ కండ్రిగలో భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజానికి, పర్యావరణానికి ప్లాస్టిక్ ఒక భూతంగా మారిందని, మనం నివారించకపోతే అనేక దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం అన్ని గ్రామాల్లో పరిసరాలను పారిశుద్ధ్య కార్మికులతో కలసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మండల విస్తరణాధికారి రమేష్, సత్యనారాయణ, ధరణిప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సమాజ సేవతో వ్యక్తిత్వ వికాసం



కార్వేటినగరం: స్వచ్ఛతా హీ సేవ అవగాహన ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు

కార్వేటినగరం: సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయలురెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థులు మానవ సేవే మాధవ సేవ అని భావించి నిస్వార్థమైన సేవలను అందించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ సేవ చేసేందుకు వేదికగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ క్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో ప్లాస్టిక్, కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు వంటి వ్యర్థ పదార్థాలను తొలగించి ప్లాస్టిక్ రహిత కళాశాల ప్రాంగణంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు సుబ్బారావు, లత, హరిబాబు, రఘురాం, కార్తీక్, జోగిప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, భార్గవి, మీనా విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం

నగరి: ప్లాస్టిక్ నిర్మూలన ఇంటి నుంచే ప్రారంభిద్దామంటూ స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్‌డేను పురస్కరించుకొని కళాశాల నుంచి కొండచుట్టు మండపం వరకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు అక్కడే మానవహారం ఏర్పాటుచేసి ప్లాస్టిక్ వస్తువులు నిషేధిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఇలంగోవన్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కళాశాలలోని ఎన్ఎస్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు అలెగ్జాండర్, జ్ఞానశేఖర్, వాసు, చెంగలరాజు పాల్గొన్నారు.



మానవహారంగా విద్యార్థులు

పొలం పిలుస్తోంది సద్వినియోగం చేసుకోండి

పెనుమూరు(కార్వేటినగరం): రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సుహర్‌లత అన్నారు. మంగళవారం రామకృష్ణాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరపల్లి హరికృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పొలంలో వరి, వేరుశనగ, జామ ఇతర పంటలను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పులిగుంటేశ్వర ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి

జీడీ నెల్లూరులో..

గంగాధరనెల్లూరు: రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ భవాని కోరారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని అక్కన్నగారిపల్లిలో మంగళవారం రైతులతో కలసి అధికారులు వేరుశనగ పంటను పరిశీలించారు. వెటర్నరీ ఏడీ మురళీమోహన్, ఉద్యానవన అధికారి బాలాజీ, సిరికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ జయచంద్ర, మార్కెటింగ్ యాడ్ అసిస్టెంట్ రుషేంద్రబాబు పాల్గొన్నారు

చెర్లోపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

పుత్తూరు: పట్టణ పరిధిలోని చెర్లోపల్లి ఆది ఆంధ్రవాడకు చెందిన శాంతినగర్ శ్మశాన స్థలం కబ్జాకు సంబంధించి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గడచిన నెల రోజుల వ్యవధిలో శ్మశాన స్థలాన్ని పరిరక్షించాలని ఆది ఆంధ్రవాడకు చెందిన గ్రామస్తులు రెండు పర్యాయాలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆది ఆంధ్రవాడలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, ఆది ఆంధ్రవాడకు చెందిన గ్రామస్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాలకు చెందిన వారు గాయపడ్డారు. ఆపై ఒక వర్గంపై మరో వర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

డిప్యూటీ తహసీల్దార్‌గా త్యాగరాజు



కార్వేటినగరం: కార్వేటినగరం డిప్యూటీ తహసీల్దార్‌గా త్యాగరాజు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న త్యాగరాజు బదిలీపై కార్వేటినగరం వచ్చారు. అదే స్థానంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న నీలావతి నగరి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా పదవీబాధ్యతలు స్వీకరించిన డీటీ మాట్లాడుతూ రైతులకు, విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను, ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు అందించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

ఎన్‌సీసీకి 23 మంది ఎంపిక



విద్యార్థినులకు పరుగు పందెం నిర్వహిస్తున్న హవల్దార్లు

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీకి జరిగిన ఎంపికలో మొదటి సంవత్సరానికి 23 మంది ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరరాజు తెలిపారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ 29వ బెటాలియన్ హవల్దార్లు ప్రసాద్, మింజల పర్యవేక్షణలో కళాశాల లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భౌతిక పరీక్షలు నిర్వహించి 23 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. అధ్యాపకులు డా.రెడ్డి నాయక్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవకు అంకితం కావాలి





వెదురుకుప్పం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద, పుత్తూరు: మాట్లాడుతున్న జయప్రసాద్

వెదురుకుప్పం: సమాజ సేవకు విద్యార్థులు పునరంకితం కావాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధానంగా రక్తదాన శిబిరాలు, పరిసరాలను శుభ్రం చేయడం, మొక్కలు పెంచడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమాజాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మంగళగౌరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపమే ఎన్ఎస్ఎస్

పుత్తూరు: సేవకు ప్రతిరూపమే నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) అని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయప్రసాద్, అధ్యాపకులు అపరంజి, నిరంజన్, కవిరసు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పాలసముద్రం: పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రిన్సిపల్ హేమలత సమక్షంలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రమదానం చేపట్టారు. కళాశాల పరిసరాలు పరిశుభ్రత చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు సూరి, వినాయకం, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవరుచుకోండి

కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని ఆర్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీషర్ కృష్ణకిషోర్ సూచించారు. స్థానిక ఆర్కేఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ పి.స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథక దినోత్సవంలో డాక్టర్ కమలాకరరెడ్డి మాట్లాడుతూ సేవ ద్వారా విద్య నినాదంతో 1969 సంవత్సరం నుంచి భారతదేశంలో జాతీయ సేవా పథకం అమల్లోకి వచ్చినట్లు ఈసందర్భంగా తెలిపారు. గత 55 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేష్‌కుమార్, రాజేష్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలసముద్రం : ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



కార్వేటినగరం: ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ కమలాకరరెడ్డి

నిబంధనల మేరకు లేఔట్లకు అనుమతులు

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఔట్లకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం తుడా పరిధిలోని రేణిగుంట, వడమాలపేట, చంద్రగిరి వద్ద ఏర్పాటు చేసిన లేఔట్లలో కల్పించిన వసతులను తుడా అధికారులతో కలసి ఆమె పరిశీలించి మాట్లాడారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి

పుత్తూరు: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని వడమాలపేట వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎల్ఎం కండ్రిగలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయాధికారులతో పాటు అనుబంధశాఖ అధికారులు పొలం బాట పడతారని తెలిపారు. పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సహాయకులు యమున, దివ్య, మోహన్, రైతులు పాల్గొన్నారు.



పుత్తూరు: రైతులకు సూచనలు ఇస్తున్న విజయ్‌కుమార్

రైతుల ముంగిటకే సేవలు

శ్రీరంగరాజపురం: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి, రైతుల ముంగిటకే సేవలందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఏఓ నర్మద, వెటర్నరీ డాక్టర్ శ్రీవిద్య అన్నారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు ఉదయం ఓ గ్రామంలో, మధ్యాహ్నం ఓ గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజాప్రతినిధులతో కలసి గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు సమస్యలు తెలుసుకుని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఎస్ఆర్ పురంలో ఉప్పరపల్లి సీకేపురంలో జరిగిన కార్యక్రమానికి వెటర్నరీ డాక్టర్ శ్రీవిద్య హార్టికల్చర్ అసిస్టెంట్ ఢిల్లీ ప్రసాద్, వీఎస్ఏ భరత్, వీఏఏ ప్రియాంక, శివ, జెడ్పీఎన్ఎఫ్ ప్రతాప్ పాల్గొన్నారు.

డ్రోన్ వ్యవసాయం లాభదాయకం

విజయపురం: ఒకప్పుడు డ్రోన్‌లు సైనిక అవసరాల కోసం మాత్రమే ఉపయోగించేవారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో కూడా డ్రోన్‌లు ఉపయోగించడంతో రైతులు తక్కువ సమయం, ఖర్చుతో వ్యవసాయం చేసుకొని లాభం పొందుతున్నారని వ్యవసాయాధికారి రజినీకుమార్ తెలిపారు. మంగళవారం విజయపురం, దళితవాడ పంచాయతీలో పొలం పొలుస్తోంది కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ సాయంతో చేసే వ్యవసాయ పద్ధతిని రైతులకు వివరించారు.

రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి

వెదురుకుప్పం: రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని జెడ్పీటీసీ సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మాంబేడు పంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించి తద్వారా వ్యవసాయాభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్, వ్యవసాయాధికారి వనిత, రైతు సేవా కేంద్ర చైర్మన్ కేశవులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ల ఆవిష్కరణ

నగరి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు. డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏలు సౌభాగ్యలక్ష్మి, రమేష్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

నింద్ర: రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన, సూచనలు ఇవ్వడానికే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం అమలు చేసినట్లు జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరామపురం, కావునూరు గ్రామాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మట్లాడుతూ రైతులకు వరి, వేరుశనగ, చెరకు పంటల్లో ఆధునిక పద్ధతుల ద్వారా కలుపు నివారణ, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం చెరకు పంటను ఆయన పరిశీలించారు. ప్రతి పంటను ఈక్రాప్ నమోదు చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి తులసీరాం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో సారవంతం

పాలసముద్రం : వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ ఢిల్లీప్రసాద్ సూచించారు. మంగళవారం వనదుర్గాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



వనదుర్గాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్









వెదురుకుప్పం: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుకుమార్, విజయపురం: డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నగరి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, శ్రీరంగరాజపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ